ప్రజాశక్తి
శనివారం 23 సెప్టెంబర్ 2023
5
విజయనగరం

ర్యాగింగ్ నిరోధంపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక జెఎన్‌టియు-జివిలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన ర్యాగింగ్ నిరోధంపై ప్రత్యేక న్యాయ అవగాహన శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ప్రముఖ న్యాయవాది ఎంఎంఆర్ఆర్ఎస్ కుమార్ మాట్లాడుతూ ర్యాగింగ్ నిరోధంపై పలు సెక్షన్లు గురించి వివరించారు. సర్వజన ఆస్పత్రి మానసిక వైద్య నిపుణులు డాక్టర్ మల్లిక మాట్లాడుతూ మత్తు పదార్థాలు వాడడం వల్ల వచ్చే అనర్థాలు, అవి మానవ మెదడును, శరీరాన్ని ఏ విధంగా నాశనం చేస్తాయి, ఇతరుల ప్రేరేపితం నుండి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. జెఎన్‌టియు రిజిస్ట్రార్ జి.జయసుమ, ప్రిన్సిపల్ కె.శ్రీకుమార్, జి.దుర్గయ్య , సీనియర్ సివిల్ జడ్జి కె.నాగమణి, పిపి వేలూరి రఘురాం, సీనియర్ న్యాయవాది తాడి రాజు పాల్గొన్నారు.

మందకొడిగా ఇ-క్రాప్ నమోదు

- గడువు ముగింపుదశలోనూ 54 శాతమే
- గుర్తింపునకు నోచుకోని 70 శాతం నువ్వుల పంట

ఇ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

జిల్లాలో ఇ-క్రాప్ నమోదు నత్తనడకన సాగుతోంది. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 3,09,835 ఎకరాల మేర వ్యవసాయ పంటలు, 1,11,235 ఎకరాల వరకు ఉద్యాన పంటలకు ఇ-క్రాప్ నమోదు చేయాల్సి ఉంది. వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిపి ఇప్పటి వరకు 54 శాతం మాత్రమే నమోదైంది. ముఖ్యంగా 70 శాతం నవ్వులపంట గుర్తింపునకు నోచుకోలేదు. దీంతో, ఈ ఏడాది పంటల నష్టపరిహారం, బీమా వర్తింపుపై రైతుల్లో ఆందోళన వ్యక్తమౌతోంది. వ్యవసాయశాఖ అధికారులు మాత్రం సాంకేతిక కారణాలను సాకుగా చూపుతున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పంటలకు ఇ-క్రాప్ నమోదు ఆధారంగానే ప్రభుత్వం పంట నష్టపరిహారం, బీమా, సున్నావడ్డీ పథకాలు వర్తింపజేస్తున్న విషయం విదితమే. వీటితోపాటు ఉత్పత్తులను కొనుగోలు చేసి, వాటికి కనీస మద్దతుధర కల్పించేందుకు కూడా ఇ-క్రాప్‌తోనే ప్రభుత్వం ముడిపెట్టింది. విజయనగరం జిల్లాలో ఇ-క్రాప్ కింద గుర్తింపు పొందని రైతులు, ముఖ్యంగా ధాన్యం విక్రయంలో ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఈ నేపథ్యంలో ఇ-క్రాప్ నమోదు అనేది రైతులకు అత్యంత కీలకంగా మారింది. అమలు విషయంలో లక్ష్యానికి దూరంగా ఉండడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. జిల్లాలో ఖరీఫ్ సీజన్ అత్యంత ప్రాధాన్యతగలది. ఎక్కువ భూభాగంలో వర్షాధారంగానే పంటలు సాగవుతాయి కాబట్టి రబీలో పంటలు నామమాత్రమే. ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న, పత్తి, చెరకు, నువ్వులు, రాగులు, చిరుధాన్యాలు తదితర పంటలు కలిపి సుమారు 4 లక్షల ఎకరాల్లో సాగవుతాయి. ఇందులో అత్యధికంగా వరి 2,23,025 ఎకరాల్లో సాగవుతుంది. ఆ తరువాత స్థానంలో మొక్కజొన్న, పత్తి, చెరకు ఉన్నాయి. వీటితోపాటు మిగిలిన అన్నిపంటలూ కలుపుకుని ఇప్పటి వరకు 2,41,756 ఎకరాల్లో సాగయ్యాయి. ఇందులో అత్యధికంగా వరి 1,94,477 ఎకరాల్లో సాగైంది. ఇందులో ఇప్పటివరకు కేవలం 1,38,000 ఎకరాలకు మాత్రమే ఇ-క్రాప్ నమోదైంది. మొక్కజొన్న 37,728 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా, 48 శాతం, పత్తి 73 శాతం చొప్పున ఇ-క్రాప్ నమోదు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. నువ్వుల పంట 9,817 ఎకరాల్లో సాగైంది. జులైలోనే కోతలు పూర్తిచేసినప్పటికీ 31 శాతం పంట మాత్రమే ఇ-క్రాప్‌లో నమోదు చేశారు. దీనిపై అధికారులను వివరణ కోరగా నువ్వులపంట ఏప్రిల్ నుంచే మొదలవుతుందని, జులై నెలాఖరికి పంటచేతికి కూడా అందుతుందని చెబుతున్నారు. అప్పటి వరకు ఇ-క్రాప్ యాప్ అందుబాటులో లేకపోవడం వల్ల నమోదులో జాప్యం జరిగిన మాట వాస్తవమేనని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అన్ని పంటల రైతులు ఒకింత ఆందోళన వ్యక్తం చేస్తుండగా, అధికార యంత్రాంగం సాంకేతిక సమస్యల వల్లే ఇ-క్రాప్ నెమ్మదిగా సాగుతోందని చెబుతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా జులై 30 నుంచి ఇ -క్రాప్ నమోదు ప్రారంభమైంది. సెప్టెంబర్ 15లోపు పూర్తిచేయాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. తాజాగా ఈనెలాఖరు వరకు గడువు పెంచినట్టు సమాచారం. ఇ-క్రాప్ నమోదులో భాగంగా సంబంధిత రైతుల ఫొటోలను పొలంలోనే తీసి అప్‌లోడ్ చేయాలి. ఇకెవైసి కూడా తీసుకోవాలి. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు వేలాది ఆర్‌బికెలు ఇదే పనిలో ఉండడం వల్ల సర్వర్ సహకరించడం లేదని ఆయా సిబ్బంది వాదన. జిల్లాలో చిన్నచిన్న భూ కమతాలు కావడం వల్ల ఉత్తరాంధ్ర మినహా ఇతర జిల్లాలతో పోలిస్తే రైతుల పరిధిలోని సర్వే నంబర్లు కూడా ఎక్కువగానే ఉన్నాయి. మన జిల్లా పరిధిలో సుమారు 30.16 లక్షల సర్వే నంబర్లు ఉన్నట్టు సమాచారం. సర్వే నంబర్లు ఎక్కువగా ఉండడం వల్ల ఎంట్రీలకు కూడా ఎక్కువ సమయం పడుతుందని క్షేత్రస్థాయి సిబ్బంది చెబుతున్నారు. ఏదేమైనా పంటలన్నీ సకాలంలో ఇ-క్రాప్ నమోదు కాకపోతే రైతులకు తీవ్ర నష్టమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యుటిఎఫ్ జెండావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, నాయకులు

ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరుగని పోరాటం

- యుటిఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్
- స్వర్ణోత్సవ ప్రచారయాత్రకు ఘనస్వాగతం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, బొబ్బిలిరూరల్, గజపతినగరం

ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ అలుపెరుగని పోరాటం సాగిస్తోందని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్-ఎస్ ప్రసాద్ వెల్లడించారు. యుటిఎఫ్ చేపట్టిన స్వర్ణోత్సవ ప్రచారయాత్ర శుక్రవారం విజయనగరం జిల్లాలోకి ప్రవేశించింది. బొబ్బిలి, గజపతినగరం మీదుగా విజయనగరం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో యుటిఎఫ్ జెండాను నాయకులు ఆవిష్కరించారు. ఎక్కడికక్కడ యాత్రకు యుటిఎఫ్ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ప్రసాద్ మాట్లాడారు. 49 ఏళ్ల కాలంలో విద్యారంగ వికాసం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం యుటిఎఫ్ ఎన్నో ఐక్య ఉద్యమాలను చేపట్టిందన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో అగ్రభాగాన ఉండటమే కాకుండా, ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా వారికి ఆర్థిక, హార్థిక సహాయం అందించిన ఏకైన సంఘం యుటిఎఫ్ అన్నారు. విద్యార్థుల హక్కులు, చదువు, పాఠశాల మూసివేత లాంటి ప్రతి అంశంలోనూ చొరవతీసుకుని పనిచేసిందన్నారు. ప్రస్తుతం జాతీయ నూతన విద్యా విధానం రద్దు, పాత పింఛను సాధన, రాష్ట్రంలో విద్యారంగ సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాటాలు సాగిస్తోందని తెలిపారు. వీటన్నిటిని పునశ్చరణ చేసుకునేందుకు, భవిష్యత్తు పోరాట కార్యాచరణను రూపొందించేందుకు స్వర్ణోత్సవాల సభ వేదిక కానుందని తెలిపారు. అక్టోబరు ఒకటో తేదిన విజయవాడలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగే సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు రెడ్డి మోహనరావు, లక్ష్మీరాజా, రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, డి.రాము, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి రమేష్‌చంద్ర పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, జిల్లా నాయకులు వి.ప్రసన్నకుమార్, శ్రీనివాసరావు, కిలాడ అప్పారావు, తిరుపతి నాయుడు, కేశవరావు, వాసు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో పాము కలకలం

ఆందోళనలో ఉద్యోగులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పామును పట్టుకుంటున్న వ్యక్తి

ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి, ప్రజలు చీడపీడ, పురుగుల నుంచి జాగ్రత్తగా ఉండాలంటూ చెప్పే జిల్లా అధికార యంత్రాంగ ప్రధాన కార్యాలయమైన కలెక్టరేట్ పాములకు నిలయంగా మారింది. కొద్ది నెలల క్రితమే కలెక్టరేట్‌లో విద్యాశాఖ కార్యాలయ సమీపంలో పాము కలకలం రేపిన విషయం తెలిసిందే. అది మరువక ముందే శుక్రవారం మళ్లీ అదే డిఇఒ కార్యాలయ సమీపంలో పాము కలకలం రేపింది. పాములు పట్టే వ్యక్తికి ఉద్యోగులు సమాచారం ఇచ్చారు. మధ్యాహ్నం ఒక గంట సమయంలో ఆయన వచ్చి పామును పట్టుకొని తరలించారు. అంతవరకు గోడకు ఉన్న పైప్‌లైన్‌లో పాము ఉండటంతో ఉద్యోగులు విధులకు వెళ్లేందుకు భయపడ్డారు.

ఇటీవల పడిన వర్షాల కారణంగా విద్యా శాఖ కార్యాలయం చుట్టూ, ఎదురుగా విపరీతంగా తుప్పలు, డొంకలు పెరగడంతో పాములు బయట పడుతున్నాయి. దీంతో విద్యా శాఖ కార్యాలయ ఉద్యోగులు, పక్కనే ఉన్న సర్వే శాఖ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. గతంలో పాము కలకలం రేపడంతో ఆయా శాఖల్లో ఉన్న ఉద్యోగులు కుర్చీలో కూర్చొన్నా ఎక్కడ పాములు వస్తాయోనని కాలు కింద పెట్టకుండా భయంభయంతో విధులు నిర్వహిస్తున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల ఇంటి ముంగిటకే వైద్య సేవలు

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

ప్రజల ఆరోగ్య పరిరక్షణే పరమావధిగా, ఇంటి ముంగిటకే వైద్య సేవలను అందించే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సిఎం జగన్ రూపొందించారని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రెండు జిల్లాల పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారులు, ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలతో జెడ్‌పి సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష, పింఛన్లు, ప్రాధాన్యతా భవనాల నిర్మాణం, గడపగడపకు మన ప్రభుత్వం, వాలంటీర్ల ఖాళీలు, పంచాయతీరాజ్ శాఖ కార్యక్రమాలపై సమీక్షించారు. ఆయా అధికారుల ద్వారా సంబంధిత ప్రగతి నివేదికలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 30 నుంచి ప్రారంభమయ్యే ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను, అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. సుమారు 105 రకాల మందులను ఉచితంగా అందించి, 14 రకాల వైద్య పరీక్షలను శిబిరాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డుల్లో పొరపాటున వయసు తక్కువగా నమోదైన వారు దరఖాస్తు చేసుకొంటే, వారికి మెడికల్ బోర్డు ద్వారా వయసు నిర్ధారించి, అర్హత ఉన్నవారికి పింఛను మంజూరు చేస్తామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంతో సహా అన్ని ప్రభుత్వ భవనాలు, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ శాఖల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని కోరారు. ఇంజినీరింగ్ సహాయకుల సేవలను వినియోగించుకోవాలని,

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

బిల్లులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. నిధులకు ఎక్కడా ఇబ్బంది లేదని తెలిపారు. వాలంటీర్ల ఖాళీలను ప్రతీవారం భర్తీ చేయాలని ఎంపిడిఒలను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. వారంలో కనీసం మూడు రోజులపాటు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్, విజయనగరం, పార్వతీపురం జిల్లాలకు చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎంపిడిఒల సంఘం నూతన కార్యవర్గం

అనంతరం ఎంపిడిఒల సంఘం ఉమ్మడి విజయనగరం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా కె.రాజ్‌కుమార్ (జెడ్‌పి సిఇఒ) అధ్యక్షులుగా శంబంగి రామకృష్ణ (తెర్లాం), ఉపాధ్యక్షులుగా సాల్మన్‌రాజు (గుమ్మలక్ష్మీపురం), ప్రధాన కార్యదర్శిగా కె.రామకృష్ణరాజు (చీపురుపల్లి), సంయుక్త కార్యదర్శులుగా రమాదేవి (సాలూరు), బి.ఎస్.కె.ఎన్.పట్నాయక్ (వేపాడ) కోశాధికారిగా కె.శేషుబాబు(శృంగవరపుకోట) ఎన్నికయ్యారు.

సామాజిక భద్రత కల్పించాలి

బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

రైతులు, చిరు వ్యాపారులు, చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల నిర్వాహకులకు చేదోడుగా ఉంటూ సామాజిక భద్రత కల్పించేలా రుణ మంజూరు ప్రక్రియ ఉండాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. జిల్లా త్రైమాసిక బ్యాంకర్ల సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. రుణ మంజూరు ప్రక్రియ, సామాజిక భద్రత పథకాలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, పరిశ్రమల స్థాపనకు బ్యాంకర్ల తోడ్పాటు, ముద్ర, పిఎంజివై, తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో భాగంగా గత త్రైమాసికంలో తీసుకున్న నిర్ణయాలు, అమలు ప్రక్రియ గురించి ఎల్‌డిఎం శ్రీనివాసరావు వివరించారు. రుణ మంజూరు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావించారు.

కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ రుణ మంజూరు ప్రక్రియను సులభతర రీతిలో నిర్వహించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తుల తిరస్కరణకు గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని, సంబంధిత నివేదికను అందజేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. సిసిఆర్ కార్డులున్న కౌలు రైతులకు ప్రోత్సాహకర రీతిలో రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఇటీవల రాజాంలో జరిగిన సంఘటనను పరిగణనలోకి తీసుకొని స్వయం సహాయక సంఘాల సభ్యులకు చెందిన నగదును వారి ఖాతాల్లో మాత్రమే జమ చేయాలని, టీం లీడర్ ఖాతాలో జమ చేయవద్దని ఆదేశించారు.

రూ.1.97 లక్షల చెక్కును అందించిన కెనరా బ్యాంకు

స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఎసిలు ఏర్పాటు చేసే నిమిత్తం సిఎస్ఆర్ కింద కెనరా బ్యాంకు యాజమాన్యం రూ.1,97,390 విలువైన చెక్కును జిల్లా కలెక్టర్‌కు అందజేసింది. ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఆ చెక్కును అందజేయాలని ఎల్‌డిఎంకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ ఎల్‌డిఎం ప్రత్యూష, మెప్మా పీడీ సుధాకర్‌రావు, సెంట్రల్ బ్యాంకు సిఇఒ జనార్దనరావు, ఫిషరీస్ డిడి నిర్మలకుమారి, ఎపిడి సావిత్రి, వ్యవసాయ శాఖ ఎడి అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వాటర్ ప్లాంట్‌ను

ఎందుకు సీజ్ చేయరు?

అధికారులకు పిపిఎస్ఎస్ కార్యదర్శి రెడ్డి శంకరరావు సూటి ప్రశ్న

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గెడ్డను ఆక్రమించి, అనుమతులు లేకుండా నడుపుతున్న స్వాతీ ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను ఎందుకు సీజ్ చేయడం లేదని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు, అయ్యప్పనగర్ అసోసియేషన్ నాయకులు యుఎస్ రవికుమార్ ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక ఎల్‌బిజి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అయ్యప్ప నగర్‌లోని స్వాతీ ప్యూరిఫైడ్ కూలింగ్ వాటర్ ప్లాంట్‌కి అనుమతులు ఇవ్వలేదని మున్సిపల్, భూగర్భ జల వనరుల శాఖాధికారులు రాత పూర్వకంగా రిపోర్టు ఇచ్చారని తెలిపారు. గెడ్డను 500 గజాలు ఆక్రమించారని తహశీల్దార్ నిర్ధారించారని, వెంటనే సీజ్ చేస్తున్నట్లు ఆర్‌డిఒ చెప్పారని గుర్తుచేశారు. అయినా అక్రమ వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేయకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. పోలీస్, మున్సిపల్ అధికారులు మూసివేసిన వెంటనే తాళాలు బద్దలు కొట్టి వాటర్ ప్లాంట్ నడుపుతున్న యజమానిపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదని మండిపడ్డారు. న్యాయం కోసం పోరాడుతున్న అయ్యప్పనగర్ నాయకులపై తప్పుడు అట్రాసిటీ కేసులు పెట్టి, 41సిఆర్‌పిసి నోటీసులు ఇవ్వడం అన్యాయమన్నారు. తక్షణమే తప్పుడు కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని స్పష్టంచేశారు. అందులో భాగంగా ఈ నెల 25న కలెక్టర్‌కు సామూహిక రాయబారం నిర్వహిస్తామని, 26న రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు కె.త్రినాథ్, అయ్యప్పనగర్ నాయకులు సుధీర్ పాల్గొన్నారు.

సర్వజన ఆస్పత్రిలో ఆర్ఒ ప్లాంట్

ప్రజాశక్తి-విజయనగరం

ఆస్పత్రికి వచ్చే రోగులు, సహాయకులు, విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బంది సౌకర్యార్థం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రూ.10.50 లక్షలు జిల్లా పరిషత్తు నిధులు వెచ్చించి ఆర్ఒ ప్లాంటు నిర్మించామని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సర్వజన ఆస్పత్రి వద్ద నిర్మించిన ఆర్ఒ ప్లాంటును శుక్రవారం జెడ్‌పి చైర్మన్, కలెక్టర్ నాగలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకులను, కూలింగ్ వాటర్ కోసం ప్రత్యేకంగా మరో 80 లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకును ఏర్పాటు చేశామని చెప్పారు. ప్లాంటు నిర్వహణ కోసం మరో రూ.2.50 లక్షలు అవసరమవుతుందని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ప్రస్తావించగా జెడ్‌పి చైర్మన్ సానుకూలంగా స్పందించారు.

ఆసుపత్రిలో అన్ని రకాల వసతులూ సమకూరుస్తున్నామని, కేంటీన్ ఒకటి ఉండిపోయిందని ల్లా కలెక్టర్ వద్ద జెడ్‌పి చైర్మన్ ప్రస్తావించారు. దానిని కూడా త్వరలోనే అందుబాటులోకి తీసుకొచ్చేందుకు యోచిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, జెడ్‌పి సిఇఒ రాజ్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమాశంకర్, సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ అప్పలనాయుడు, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ పద్మలీల, తదితరులు పాల్గొన్నారు.


నిరసన చేపడుతున్న మున్సిపల్ కార్మికులు, నాయకులు

మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కార్మికులకు సిఎం జగన్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ఎ.జగన్మోహనరావు ఆధ్వర్యాన శుక్రవారం రాజీవ్ స్టేడియం వద్ద క్లాప్ వాహన డ్రైవర్లు, కార్మికులు నిరసన చేపట్టారు. విజయవాడలో ధర్నా చౌక్ వద్ద మున్సిపల్ కార్మికులు చేపడుతున్న దీక్షలకు సంఘీభావంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్లాప్ వాహన డ్రైవర్లకు 18500 జీతం ఇస్తామని విడుదల చేసిన జిఒ 7ను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్ రద్దు చేస్తానని, ఆరు నెలల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల అందర్నీ పర్మినెంట్ చేస్తానని చెప్పి నాలుగేళ్లు గడుస్తున్నా చర్యలు తీసుకోకుండా కార్మికులకు ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయకపోతే సమ్మెకు సిద్ధం కాబోతున్నామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ నెల 25న కార్పొరేషన్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫెడరేషన్ కార్పొరేషన్ కార్యదర్శి బి.భాస్కరరావు, నాయకులు రామచంద్రరావు, కృష్ణ, రామారావు, రాఘవ, కుమారి, రమ, లక్ష్మణరావు, సూరి, చిన్ని, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూలు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

లక్ష్యాల మేరకు ఆస్తి పన్ను వసూలు విషయంలో సిబ్బంది మరింత కృషి చేయాలని కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఆస్తిపన్ను వసూళ్లపై సమీక్షించారు. సహాయ కమిషనర్ ప్రసాదరావు మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ వరకు పన్ను వసూళ్ల ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. 3.5 కోట్ల రూపాయలు వసూలే లక్ష్యంగా సిబ్బందికి దిశా నిర్దేశం చేశామన్నారు.

ఆధునిక యుగకర్త గురజాడ

ఎయు ప్రొఫెసర్ ఈశ్వరమ్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమాజాన్ని పట్టి పీడిస్తున్న రుగ్మతలను రూపుమాపడంతోపాటు తెలుగు భాషా చరిత్రను మలుపు తిప్పిన ఆధునిక యుగకర్త గురజాడ అప్పారావు అని ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ కొనియాడారు. గురజాడ జయంతి సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం గురజాడ విజ్ఞాన కేంద్రం - జన విజ్ఞాన వేదిక సంయుక్తంగా నిర్వహించిన 'గురజాడ సాహిత్యం -సాహితి సౌరభం' అనే అంశంపై ఏర్పాటుచేసిన సదస్సులో ఆమె మాట్లాడారు. సామాన్యుడు మాట్లాడే వాడుకభాషను ఉపయోగించి తెలుగు భాషను సరళీకరించిన గురజాడ చిరస్మరణీయుడన్నారు. ఆధునిక సమాజాల్లో కనిపించే నవ్య భావాలను వ్యాపింపజేయడానికి తెలుగు సాహిత్యాన్ని ఎంచుకున్నారని తెలిపారు. గురజాడ విజ్ఞాన కేంద్రం జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ సంస్కరణ, ఆధునికత, అభ్యుదయం, ముందుచూపు లాంటి ఎన్నో లక్షణాలను సంతరించుకుని సమాజ పురోగమనానికి గురజాడ బాటలు వేశారని కొనియాడారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ చీకటి దివాకర్ మాట్లాడుతూ వందేళ్ల పైబడి ముందుచూపుతో దేశాభివృద్ధికి ప్రణాళికలు, కుల, మతాలకు అతీతమైన విశ్వమానవ సమాజం కోసం గురజాడ దిశానిర్దేశం చేశారని కితాబిచ్చారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎంవిఎన్ వెంకటరావు, పి.రమణ ప్రభాత్ మాట్లాడుతూ గురజాడ ప్రవచించిన శాస్త్రీయ ఆలోచన బాటలోనే జెవివి కూడా పనిచేస్తుందని తెలిపారు. గురజాడ ఇందిరా మాట్లాడుతూ తన పర తేడా లేకుండా ఎక్కడ తప్పు ఉంటే ఆ తప్పును గురజాడ ఎత్తిచూపారన్నారు.

గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎయు ప్రొఫెసర్ ఈశ్వరమ్మ

ఆరోగ్య సురక్ష సర్వే పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీరాములునాయుడు

ప్రజారోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలవుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.శ్రీరాములు నాయుడు వెల్లడించారు. ఈ మేరకు నగరంలో చేపడుతున్న ఆరోగ్య సురక్ష సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. గాజులరేగ, తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సర్వే ఏ విధంగా తమ సిబ్బంది చేస్తున్నారని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్య విషయాలను నమోదు చేస్తున్నారా? లేదా అని గమనించారు. అనంతరం గాజులరేగలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. రింగ్‌రోడ్‌లో ఉన్న ట్రాన్సిట్ స్టేషన్‌ను, అక్కడ నూతన నిర్మాణాలను పరిశీలించారు.

యాజమాన్యం తీరు మారాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఆర్‌టిసి విజయనగరం డిపోకు సంబంధించి యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటుందని, యాజమాన్యం తీరు మారకపోతే ప్రతిఘటన తప్పదని ఎన్ఎంయు జిల్లా అధ్యక్షులు పి.జి..రాఫెల్ హెచ్చరించారు. ఎన్ఎంయు ఆధ్వర్యంలో శుక్రవారం విజయనగరం గ్యారేజ్ ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్యూటీ చేసేందుకు అనుకూలం కాని సర్వీసును బలవంతంగా ప్రారంభించడాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షులు బి.రామారావు, కార్యదర్శి కె.చంద్రమౌళి, కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

- నెల్లిమర్ల మండలస్థాయి జగనన్నకు చెబుదాంలో కలెక్టర్
- పలువురి నుంచి వినతులు స్వీకరణ
- జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పరిశీలన

ప్రజాశక్తి- నెల్లిమర్ల

సమస్యలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. జగనన్నకు చెబుదాం ప్రజా వినతుల కార్యక్రమాన్ని మండల స్థాయికి విస్తరించే చర్యల్లో భాగంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్నిశుక్రవారం నెల్లిమర్ల మండల కేంద్రంలో నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ వర్గాల ప్రజల నుంచి 86 వినతులు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, మున్సిపల్ కమీషనర్ బాలాజీ ప్రసాద్, తహశీల్దార్ ధర్మ రాజు, ఎంపిడిఒ రామారావు, మండల ప్రత్యేకాధికారి వినతులను స్వీకరించారు. మండలస్థాయి వినతుల స్వీకార కార్యక్రమంలో రెవిన్యూశాఖకు సంబంధించి 26, గృహ నిర్మాణానికి సంబంధించి 16, వైద్యారోగ్య శాఖకు 4, పంచాయతీరాజ్‌కు 3, డిఆర్‌డిఎకు 10, పంచాయతీరాజ్‌కు 14, ఆర్‌డబ్లుఎస్ శాఖకు 5, మిగిలినవి ఇతర శాఖలకు చెందిన వినతులు అందాయి.

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రతి ఒక్కరూ హాజరు కాలేరని భావించి మండలాల్లో కూడా జగనన్నకు చెబుదాం వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా అధికారులంతా ఈ కార్యక్రమంలో స్వీకరించిన ప్రజావినతులను అర్జీదారులో సంతృప్తిని పెంచే దిశగా పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన లేకపోవడం వల్ల కొన్ని ఫిర్యాదులు వస్తున్నాయని, ముందుగా పథకాలపై ఆయా శాఖలు సమగ్రంగా వివరించి అవగాహన కలిగించాలని సూచించారు. వినతుల పరిష్కారంలో మండల అధికారులంతా ఇంటర్ డిపార్టుమెంటల్ కో ఆర్డినేషన్‌తో పని చేయాలని చెప్పారు.

నెల్లిమర్ల నగర పంచాయతి వైస్ చైర్మన్ సముద్రపు రామ రావు జిల్లా కలెక్టర్‌ను కలసి నెల్లిమర్ల నగరపంచాయతీ పేరును నెల్లిమర్ల - జరజాపు పేట నగర పంచాయతీగా మార్చాలని కోరారు. జరజాపు పేట రైతు భరోసా కేంద్రానికి, శాఖా గ్రంథాలయానికి పక్కా భవన నిర్మాణానికి స్థలం, నిధులు మంజూరు చేయాలని వినతులను సమర్పించారు. జగనన్న లే అవుట్ వేసేందుకు స్థలం చదును చేయాలని, జరజాపుపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు.

అనంతరం కలెక్టర్ నాగలక్ష్మి గాంధీ నగర్‌లో జరుగుతున్నా జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేసారు. ఇంటింటి తనిఖీ బృందంతో మాట్లాడి సర్వే చేస్తున్న తీరు పై ప్రశ్నించారు. లాగిన్‌లో ఏఏ అంశాలు, ఎలా నమోదు చేస్తున్నారని ప్రశ్నావళి ఎలా అడుగుతున్నారనే అంశాలను పరిశీలించారు. వాలంటీర్ ద్వారా మెడికల్ క్యాంపుకు ప్రతి ఒక్కరూ హాజరయ్యేలా చూడాలన్నారు. బిపి, షుగర్ తనిఖీ చేసిన వారికి కలెక్టర్ చేతుల మీదుగా టోకెన్లను అందజేశారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యారోగ్య అధికారి డాక్టర్ భాస్కరరావు, మున్సిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాద్, అర్బన్ పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సమీర, ఎంపిడిఒ, తహశీల్దార్, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణ గురించి కలెక్టర్‌కు వివరిస్తున్న రామారావు

చెరువు ఆక్రమణ నివారించాలి రైతులను ఆదుకోవాలి

చెరువు ఆక్రమణ నివారించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు గ్రీవెన్స్‌లో డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ జరజాపుపేట కొంతల వాని చెరువు సర్వే నెంబర్ 100 ఆక్రమణలకు గురై రైతులు సాగు నీటి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో తహశీల్దార్, ఇరిగేషన్ ఏఇ, నగర పంచాయతీ కమిషనర్‌కి కూడా ఫిర్యాదు చేశామని పట్టించుకోలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి ఆక్రమణలను నివారించాలని కోరారు.

ఎన్ని అర్జీలిచ్చినా తీరని సమస్యలెన్నో..?

నెల్లిమర్ల : సమస్యల పై పలు మార్లు గ్రీవెన్స్‌లు ఇచ్చినా పరిష్కారం కావడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతలో జగనన్నకు చెబుతాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన వ్యక్తులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రీవెన్సు లు అందజేశారు. ముఖ్యంగా సారిపల్లి గ్రామానికి పునరావాస ప్యాకేజీ ఇవ్వాలని గత కొన్నేళ్లుగా మొర పెట్టుకుంటున్నారు. అలాగే పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతున్నా ప్రభుత్వం అదిగో ఇదిగో అని కాలయాపన చేస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎటి అగ్రహారం గ్రామానికి పునరావాస ప్యాకేజీ కింద రావాల్సిన బకాయిలు ఇంతవరకు చెల్లించలేదని వాపోతున్నారు. కొండ వెలగాడ గ్రామం నుంచి రోళ్ల వాక వెళ్లే రహదారిని మిత్రా లే అవుట్ యజమాని ఆక్రమించడం వల్ల 5 గ్రామాలకు చెందిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పూతికపేటలో గృహ జ్యోతి లే అవుట్ యజమాని గ్రామంలో చెరువులోకి వచ్చే నీటి కాలువను ఆక్రమించుకొని రహదారి వేశారని దాని వల్ల రైతులకు సాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొండవెలగాడకు చెందిన వృద్ధుడు అర్హత ఉన్నా పింఛన్ మంజూరు చేయలేదని గ్రీవెన్స్ ఇచ్చారు. స్థానిక భవిత కేంద్రంలో తన పిల్ల ఉందని మహిళ తనకు పిల్లను చూసుకొని పని చేసే విధంగా అవకాశం కల్పించాలని పలుమార్లు గ్రీవెన్స్ ఇచ్చినా అధికార్లు స్పందించలేదని మరోసారి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. సారిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి టిబిఆర్‌టిఎస్ ప్రాజెక్టులో తన భూమి పోయిందని ఇంకా ఎకరా 3సెంట్ల భూమికి నష్ట పరిహారం ఇవ్వలేదని పలు మార్లు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడంతో ప్రస్తుతం గ్రీవెన్స్ ఇచ్చారు. పలు మార్లు గ్రీవెన్స్‌లు ఇచ్చినా సమస్యలు పరిష్కారం చేయడం లేదని బాధితులు వాపోతున్నారు.

వృద్ధాప్య పింఛను రావడం లేదు

నాకు 60 సంవత్సరాలు పూర్తయ్యాయి. అయినప్పటికీ ఇప్పటికీ నాకు వృద్ధాప్య పింఛను రావడం లేదు. ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. వాలంటీర్, సెక్రటరీ సరైన సమాధానం కూడా చెప్పడం లేదు. అందుకే నేరుగా జిల్లా కలెక్టర్‌కు నా సమస్యను చెప్పుకుందామని వచ్చాను.

బట్టు పైడితల్లి, కొండవెలగాడ

ఇంకా నష్టపరిహారం ఇవ్వలేదు

తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టులో నాకున్న 1.23 ఎకరాల భూమిని కోల్పోయాను. అప్పటి నుంచి నష్టపరిహారం కోసం తిరుగుతూనే ఉన్నాను. ఎన్ని కార్యాలయాలకు వెళ్లి ఫిర్యాదు చేసినా సమాధానం లేదు. నష్టపరిహారం అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాను. ఇప్పటికే మండల స్థాయిలో అధికారులకు, జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశాను. కానీ స్పందన లేదు. దీంతో నేరుగా నా బాధను కలెక్టర్‌కు చెప్పుకుందామని వచ్చాను.

సారిపల్లి గురునాయుడు, సారిపల్లి గ్రామ రైతు.

గ్రామ కంఠంపై దర్యాప్తు

బొబ్బిలి: స్థానిక మున్సిపాలిటీలోని పాత బొబ్బిలిలో గ్రామ కంఠం భూమి రిజిస్ట్రేషన్‌పై రెవెన్యూ అధికారులు శుక్రవారం దర్యాప్తు చేశారు. గ్రామ కంఠం భూమిపై సమగ్ర దర్యాప్తు చేసి జిల్లా ఉన్నతాధికారులకు, ఆర్‌డిఒకు నివేదిక అందిస్తామని ఆర్ఐ కల్యాణ్ చక్రవర్తి చెప్పారు. గ్రామ కంఠం భూమి సర్వేపై సౌరు సాంబయ్య ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. రిజిస్ట్రేషన్ వ్యవహారంలో రెవెన్యూ అధికారులు పాత్ర ఉంటే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కొయ్యకొండవలసలో 'పోషణ మహా'

బొబ్బిలిరూరల్: మండలంలోని కొయ్యకొండవలస గిరిజన గ్రామంలో పోషణ మహా కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహారం వల్ల కలిగే ఉపయోగాలపై ఐసిడిఎస్ సిడిపిఒ జె.విజయలక్ష్మి గర్భిణులు, బాలింతలకు వివరించారు. పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉండగలమని, పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఇస్తున్న సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ శుభలక్ష్మి, పాల్గొన్నారు.

ఎస్‌సి వసతి గృహంలో తనిఖీలు

తెర్లాం: స్థానిక ఎస్‌సి వసతి గృహాన్ని ఎంపిపి ఎన్. ఉమాలక్ష్మి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల హాజరు, మెనూ, స్టాక్ రికార్డులు, వసతి గదులను పరిశీలించారు. వ్యాధులు ప్రబలే కాలం కావున పిల్లల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పరిసర ప్రాంతాలలో పిచ్చి మొక్కలు పెరగకుండా చూసుకోవాలని వసతి గృహ అధికారులకు సూచించారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిపి

శిథిల రోడ్డు పరిశీలన

రేగిడి: మండలంలోని కొమిరి వెంకటాపురం గ్రామాలలో శిథిలమైన రోడ్డును ఎంపిడిఒ శ్యామల కుమారి శుక్రవారం పరిశీలించారు. ఈ మేరకు గత సోమవారం కొమిరి వెంకటాపురం గ్రామాలకు చెందిన విద్యార్థులు, గ్రామస్తులు జిల్లా కలెక్టర్ స్పందనకు రోడ్డు దుస్థితి అర్జీ రూపంలో వివరించారు. కలెక్టర్ ఆదేశాలతో ఎంపిడిఒ 7 కిలోమీటర్లు మేర పరిశీలించారు. తారు రోడ్డు పూర్తిగా శిథిలం కావడంతో బస్సులు, ఆటోలు తిరగడం లేదని విద్యాభ్యాసానికి ఇబ్బందిగా ఉందని కోరారు. ప్రత్యేక నిధులు ఏర్పాటు చేసి రోడ్డు మరమ్మతులు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ నివేదికలు జిల్లా కలెక్టర్‌కు అందిస్తామన్నారు.

విలువలతో కూడిన విద్యను బోధించండి

వంగర: ఉపాధ్యాయులు విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను భోదించాలని ఎంఇఒ వై దుర్గారావు అన్నారు. ఈ మేరకు స్థానిక మండల కేంద్రంలోని వివేక్ మాస్టర్ మైండ్ పాఠశాలను ఆకస్మికంగా శుక్రవారం సందర్శించారు. విద్యార్థులకు ప్రతి అంశం అర్థమయ్యే విధంగా భోదన కొనసాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో 9,10 తరగతి చదువుతున్న విద్యార్థులకు గణితం, ఆంగ్లం, తెలుగు సబ్జెక్టులలో విద్యా ప్రమాణాలు పరిశీలించారు. పాఠశాల రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బెవర ఈశ్వర రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు బ్యాంకు రుణాలకు కృషి

రేగిడి: మండలంలోని రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఉన్న గ్రామాల సిసిఆర్‌సి కార్డులు ఉన్న కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎఒ గిరడ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం ఉణుకూరు, ఉంగరాడ మెట్ట, రేగిడి బ్యాంకర్లను కలిసి సిసిఆర్‌సి కార్డులు ఉన్న అర్హులైన వారందరికీ రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.. మండలంలోని 39 గ్రామపంచాయతీలో 160 మంది కౌలు రైతులకు సిసిఆర్సి గుర్తింపు కార్డులు అందజేసినట్లు తెలిపారు. ఈ ఏడాదికి పంటలు పండించిన కౌలు రైతులకు రుణాలు ఇచ్చేందుకు జాబితాను తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కార్డులు అందజేశామన్నారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

వేపాడ : మండలంలో ఖాళీలు ఏర్పడిన గ్రామ వాలంటీర్ల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ తెలిపారు. వావిలపాడు, ఆకుల సీతంపేట (బీసీ జనరల్) ఖాళీలను భర్తీ చేయడానికి కలెక్టర్ ఆదేశాల మేరకు నోటిఫికేషన్ ఇస్తున్నామన్నారు. ఈ నెల 25లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని 26న దరఖాస్తులు పరిశీలిస్తామని, 27న ఎంపిక చేసి నియామక పత్రాలను అందిస్తామన్నారు.

గృహ సారథులకు పార్టీ అండ

బొండపల్లి : పార్టీ కోసం పనిచేసే గృహ సారదులకు పార్టీ అండగా ఉంటుందని వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నంనాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని ఒంపల్లి, కొండకిండాం, రాచకిండాం సచివాలయాల పరిధిలో గల గృహసారథులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గృహ సారథులు లబ్ధిదారులకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల జెసి కన్వీనర్ పల్లి రఘు, సర్పంచ్ బుంగ దేవుడు, వైసిపి నాయకులు చొక్కాకు నారాయణ రావు, పెదమజ్జి గోపి, తాడ్డి ప్రకాశరావు, లెంక రమణ, తాడ్డి చంద్రరావు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆమిటిలో పశు విజ్ఞాన బడి

తెర్లాం: మండలంలోని ఆమిటి రైతు భరోసా కేంద్రంలో పశువిజ్ఞాన బడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బొబ్బిలి డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఆర్.నీలయ్య, మండల ఎంఎహెచ్‌ఒ డాక్టర్ జె. నరేంద్ర కుమార్ పాల్గొని మాట్లాడారు. రైతు భరోసా కేంద్రం ద్వారా పశు సంవర్ధక శాఖ నుండి ఎటువంటి కార్యకలాపాలు జరుగుతున్నాయో రైతులకు వివరించారు. వాటి ఉపయోగాలు, హెల్త్ కార్డ్స్ ఉపయోగాలు గురించి వివరించారు.

బేబినాయన అరెస్టు

- పాదయాత్రకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- నిరసనగా రాస్తారోకో, దుకాణాల మూసివేత

బేబినాయనను అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- బొబ్బిలి

చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన తలపెట్టిన పాదయాత్రను పోలీసులు అడ్డుకున్నారు. బొబ్బిలి నుంచి సింహాచలం వరకు పాదయాత్ర చేసి సింహాద్రప్పన్నను దర్శించుకునేందుకు బేబినాయన పాదయాత్రగా శుక్రవారం ఉదయం 8.30 గంటలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసుకున్నారు. పాదయాత్రకు అనుమతి లేదని శుక్రవారం తెల్లవారు జామున కోటలోకి డిఎస్‌పి శ్రీధర్, పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు, పోలీసులు చేరుకుని బేబినాయన పాదయాత్రకు వెళ్లకుండా అదుపులోకి తీసుకుని బుదరాయవలస పోలీసు స్టేషన్‌కు తరలించారు. టిడిపి ముఖ్య నేతలను, కార్యకర్తలను గృహ నిర్బంధం చేశారు. శాంతియుతంగా పాదయాత్ర చేసి సింహాద్రప్పన్న దర్శనం చేసుకునేందుకు వెళ్తే అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని బేబినాయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బుదరాయవలస పోలీసు స్టేషన్‌లో బేబినాయనను టిడిపి చీపురుపల్లి నియోజకవర్గం ఇంఛార్జి కిమిడి నాగార్జున, మాజీ ఎమ్మెల్యేలు తెంటు రాజా, బొబ్బిలి చిరంజీవులు, జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి, జనసేన నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి, లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షులు బీశెట్టి బాబ్జి, తదితరులు పరామర్శించి అక్రమ అరెస్టును ఖండించారు. **రాస్తారోకో:** బేబినాయన అక్రమ అరెస్టుకు నిరసనగా ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలిలో టిడిపి నాయకులు రాస్తారోకో చేశారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

పలుపార్టీల ఖండన

బొబ్బిలి: టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన అరెస్టు దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, మండల కార్యదర్శి ఎస్.గోపాలం అన్నారు. సిఐటియు కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం కల్పించినప్పటికి పాదయాత్రకు సిద్ధమైన బేబినాయనను అడ్డుకుని అన్యాయంగా అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. **న్యాయవాదుల ఖండన :** బేబీనాయన పాదయాత్రను అడ్డుకోవడం దుర్మార్గమని టిడిపి జిల్లా న్యాయ విభాగ ఉపాధ్యక్షులు చెల్లారపు సత్యనారాయణ, న్యాయవాది తుమరాడ గంగాధర్ అన్నారు. పోలీసులు కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆకస్మాత్తుగా బేబీనాయనను ఇంటిని చుట్టిముట్టి ఆయనను నిర్బంధంలోకి తీసుకువడాన్ని ఖండిస్తున్నామని విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. **షాపులు మూసివేత:** బేబినాయన అరెస్టుకు వ్యతిరేకంగా కోట చుట్టూ, శ్వేతాచలపతి సంస్థానం ఇంగ్లీషు మీడియం పాఠశాల చుట్టూ ఉన్న షాపులను వ్యాపారులు మూసివేసి నిరసన తెలిపారు. బేబినాయన అరెస్టును వ్యాపారులు ఖండించారు. **మాజీ మంత్రి ఖండన:** తన సోదరుడు బేబినాయన చేపట్టిన పాదయాత్రను పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమని మాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు శుక్రవారం ఒక ప్రకటనల విడుదల చేశారు. తన సోదరుడికి ఏమి జరిగినా జగన్ ప్రభుత్వం బాధ్యత వహించాల న్నారు. **సిపిఐ ఖండన :** బేబీ నాయన అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. శాంతియుతంగా మొక్కు తీర్చుకోవడానికి బయలుదేరుతున్న సమయంలో పోలీసులు బొబ్బిలి కోటలోకి ప్రవేశించి అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శ మునకాల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, పట్టణ నాయకులు కృష్ణ ఉన్నారు.

తెర్లాం: బేబినాయన అరెస్టును ఖండిస్తూ టిడిపి మండల అధ్యక్షులు ఎన్ వెంకటట్ నాయుడు, ఎన్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా పోలీసులు పలువురు టిడిపి నాయకులను అదుపులోకి తీసుకున్నారు. **బాడంగి:** బేబీ నాయన పాదయాత్రను పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమని జిల్లా కొప్పుల వెలమ బిసి సాధికారిత చైర్మన్ కొల్లి అప్పలనాయుడు ,టిడిపి రాష్ట్ర ఎస్‌టి జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు, వైస్ ఎంపిపి సింగిరెడ్డి భాస్కర్ రావు అన్నారు. బేబినాయన అరెస్టును ఖండిస్తూ మండల కేంద్రంలో నిరసన తెలిపారు. టిడిపి నాయకులు తెంటు రవిబాబు, బొంతు త్రినాథ్, ఉయ్యాలా సత్యనారాయణలతో పాటు పలువురిని బాడంగి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. **వేపాడ:** బేబీనాయన అరెస్ట్ దుర్మార్గమని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఒక ప్రకటనలో ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం కల్పించినప్పటికి అడ్డుకోవడం దారుణమన్నారు.

విజయనగరంకోట: బేబినాయన అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు అశోక్‌గజపతిరాజు అన్నారు. శుక్రవారం ఆయన బంగ్లాలో మాట్లాడారు. శాంతియుతంగా పాదయాత్రకు సిద్ధమైన ఆయన్ను అరెస్టు సిగ్గుచేటన్నారు. టిడిపిని చూసి ప్రభుత్వం భయపడుతుందన్నారు.

'సేవాభావమే మానవత్వాన్ని మెరుగుపరుస్తోంది'

- గురుదేవ ట్రస్ట్ 25వ వార్షికోత్సవంలో ఎస్‌పి
- వికలాంగులకు ఉపకారణాలు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తవలస

సేవచేయడంతోనే సమాజంలో మానవత్వం మెరుగుపడుతుందని జిల్లా ఎస్‌పి ఎం. దీపికా పాటిల్ అన్నారు. మండలంలోని మంగళపాలెంలో శుక్రవారం నిర్వహించిన గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ 25వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం ప్రతీ వీధికో ఎన్‌జిఒలు పుట్టుకొస్తున్నాయని, అందులో కొన్ని ట్రస్టులు మాత్రమే నిస్వార్థంగా సేవలు అందిస్తున్నాయన్నారు. 25 ఏళ్ల పాటు సుమారు 2 లక్షలకు పైగా కృత్రిమ అవయవాలను వికలాంగులకు ఉచితంగా అందజేసి, వారి స్వయం ఉపాధికి, వికలాంగుల అభ్యున్నతి కోసం జగదీశ్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ముందుగా గ్రామంలో ట్రస్ట్ సహకారంతో వికలాంగునికి అందజేసిన పాన్ షాప్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా షాప్‌లో ఎస్‌పి లాలీపాప్‌లను కొనుగోలు చేశారు. అనంతరం ట్రస్ట్ ప్రాంగణంలోని అవయవ తయారీ కేంద్రం, గురుదేవ ఆసుపత్రిని ఆమె సందర్శించారు. అనంతరం పలువురు వికలాంగులకు ఎస్‌పి చేతుల మీదుగా కృత్రిమ కాళ్ళు, చేతులు, చెవిటి మిషన్లు, బ్లైండ్ స్టిక్స్, వృద్ధులకు బియ్యం పంపిణీ చేశారు. వివిధ గ్రామాలకు చెందిన భజన సంఘాలకు సామాగ్రీ, దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస సిఐ చంద్రశేఖర్, ఎస్సై బొడ్డు దేవి, ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్, వైస్ చైర్మన్ ఫణీంద్ర, గురుదేవ హాస్పటల్స్ సిఇఒ అచ్యుతరామ్మయ్య, డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ సుజాత, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాలను పంపిణీ చేస్తున్న ఎస్‌పి దీపికా పాటిల్, జగదీష్

దళిత నాయకుల రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

టిడిపి దళిత, గిరిజన నాయకులు నియోజక వర్గం కేంద్రంలో శుక్రవారం రిలే నిరాహారదీక్షలు చేశారు. రాష్ట్ర ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షల్లో టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, నాయకులు సువ్వాడ రవిశేఖర్, కంది చంద్రశేఖర్ రావు, పతివాడ అప్పలనారాయణ, పతివాడ తమ్మినాయుడు, గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు. **బొండపల్లి:** చంద్రబాబు అక్రమ అరెస్కు సంబంధించి హై కోర్టు, ఎసిబి కోర్టు శుక్రవారం తీర్పు వెల్లడించిన నేపథ్యంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణను బొండపల్లి మండల పరిషత్ సముదాయం వద్ద బొండపల్లి పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. **శృంగవరపుకోట:** స్థానిక ఆకుల డిపో వద్ద టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్ష శుక్రవారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **గజపతినగరం:** టిడిపి నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ కెఎ నాయుడు ఆధ్వరంలో స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం పక్కన చేపట్టిన నిరహార దీక్షలు శుక్రవారం కొనసాగాయి. ఈ కార్యక్రమంలో దత్తిరాజేరు మండల పార్టీ అధ్యక్షులు పెద్దింటి మోహన్ రావు, క్లస్టర్ ఇంఛార్జిలు బెజవాడ బంగారు నాయుడు, పెద్దింటి జగన్, మజ్జి మహేష్, పార్లమెంట్ కార్యదర్శి గుసిడి జగన్నాధం, ఎస్‌సి సెల్ అధ్యక్షులు సీర్ రామారావు, చెల్లూరి సత్యారావు, పెంటమాని కేశవ్ తదితరులు పాల్గొన్నారు. **పూసపాటిరేగ:** మండలంలోని కనిమెళ్ల పంచాయతీ పరిధిలోగల కామవరంలో దంతులూరి సూర్యనారాయణ మూర్తి రాజు చేపట్టిన రిలే నిరాహార దీక్షను నియోజకవర్గం ఇన్‌చార్జి కర్రోతు బంగారాజు శుక్రవారం నిమ్మరసం ఇచ్చి విరమింప జేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీకోసం ఐదు రోజులు పాటు మంచినీరు కూడా తాగకుండా దీక్షలో కూర్చున్న మూర్తిరాజు మనకందరికి ఆదర్శంగా ఉన్నారన్నారు.

మొన్న బదిలీ.. నిన్న రద్దు

సంచలనం రేపిన రేగిడి తహశీల్దార్ బదిలీ వ్యవహారం

ప్రజాశక్తి- రేగిడి

స్థానిక తహశీల్దార్ టి. కల్యాణ్ చక్రవర్తి బదిలీ వ్యవహారం సంచలనం రేపింది. నాడు బదిలీ చేసి నేడు రద్దు చేయడంతో చర్చనీయాంశమైంది. గురువారం సాయంత్రం ఆయన్ను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వులు అందాయి. ఆయన స్థానంలో కలెక్టరేట్‌లో పనిచేస్తున్న రామకృష్ణను నియమిస్తూ కూడా ఉత్తర్వులు ఇచ్చారు. అయితే 24గంటలు గడవక ముందే బదిలీ ఉత్తర్వులు రద్దయ్యాయి. తహశిల్దార్ డిప్యూటీషన్ పాలన పరమైన ఏర్పాట్లు నిమిత్తం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పిఎ పేరున తాజా ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఆర్‌సి నెంబరు 1661 ప్రకారం జరిగిన ముగ్గురు రెవెన్యూ అధికారుల బదిలీ రద్దయినట్లైంది. వాటిలో రేగిడి తహశీల్దార్ కల్యాణ్ చక్రవర్తి కూడా ఉన్నారు. తాజాగా వెలువడిన ఈ ఉత్తర్వుల ప్రకారం ఆయన బదిలీ రద్దయింది. గురువారం సాయంత్రం బదిలీ ఉత్తర్వులు రావడంతో శుక్రవారం కొత్త తహశీల్దార్ జాయిన్ అవుతారని అందరూ ఊహించారు. అయితే ఆయన రాకపోవడంతో ప్రస్తుత తహశీల్దార్ కల్యాణ్ చక్రవర్తి విఆర్‌ఒలతో సమావేశం నిర్వహించారు. దీంతో పలు ఊహాగానాలు వెలువడ్డాయి. 24 గంటల్లోగా బదిలీ రద్దవడం చర్చనీయాంశమైంది.

కల్యాణ్ చక్రవర్తి

25న చలో అసెంబ్లీ

ప్రజాశక్తి - కొత్తవలస

అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 25వ తేదీన చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొత్తవలస సిడిపిఒ రొంగలి ఉమాకి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు కాకర తులసి మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం కన్నా అదనంగా వేతనాలు చెల్లించాలన్నారు. తక్షణమే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాడ్యుటీ అమలు చేయాలన్నారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, రిటైర్మెంట్ వయసు 62గా మార్పు చేయాలని ఆఖరి వేతనంతో 50శాతం పెన్షన్ పద్ధతి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయక ప్రాజెక్ట్ ఆఫీసర్ లక్ష్మీబాయి, అంగన్వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, శారద పాల్గొన్నారు.

కొత్తవలస: సిడిపిఒకు వినతినిస్తున్న కార్యకర్తలు

గజపతినగరం: అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సిడిపిఒకు మాస్ లీవ్ లెటర్‌ను కార్యకర్తలు అందించారు. ఈనెల 25వ తేదీన విజయవాడలో జరుగు మహా ధర్నాలో పాల్గొనడానికి సెలవు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వి లక్ష్మి, ప్రాజెక్ట్ అధ్యక్షులు ఎం సుభాషిని, గజపతినగరం సెక్టార్ లీడరు డి నాగమణి పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

తెర్లాం: మండలంలోని పెరుమాలి ఏపీ మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ హై స్కూల్‌ను శుక్రవారం ఎంఇఒ త్రినాధరావు తనిఖీ చేశారు. ఇందులో భాగంగా బైజూస్ ట్యాబుల వినియోగం ద్వారా పిల్లలు విజ్ఞానం ఏ విధంగా పెంపొందించారో అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరు, పలు రికార్డులను పరిశీలించారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

బొబ్బిలి: మున్సిపాలిటీలోని పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ హెచ్చరించారు. పట్టణంలోని 15వ వార్డులో శుక్రవారం పర్యటించారు. వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వార్డులలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలన్నారు. రోడ్లు, కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఉక్కు రక్షణ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- గజపతినగరం

విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం నిర్వహిస్తున్న ఉక్కు రక్షణ యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను బంగారమ్మ పేటలో సిపిఎం నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి. శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పి మోడీ ప్రభుత్వం ఉత్తరాంధ్ర ప్రజలకు తీరని ద్రోహం చేస్తుందన్నారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా నష్టాలు ఊబిలోకి నెట్టేసి చివరకు ఎవరికీ తెలియకుండానే ప్లాంట్ అమ్మకానికి 2014లో బేర సారాలు కుదుర్చుకొని కుట్ర పన్నిందన్నారు. స్టీల్ ప్లాంట్ కార్మికులు 1000 రోజులుగా పోరాటం చేస్తున్నా ప్లాంట్ అమ్మి తీరుతామని మోడీ ప్రభుత్వం చెప్పడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా సొంత గనులు కేటాయించాలని, నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ల్యాండ్ నిర్వహణకు రూ.5వేల కోట్లు కేటాయించాలని కోరుతూ ఈ రక్షణ యాత్ర ఉత్తరాంధ్ర ఆరు జిల్లాలలో 1150 కిలోమీటర్లు మేరా బైక్ యాత్ర జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 25న ఉదయం 9గంటలకు గజపతినగరం చేరుకుంటుందని, ఈ కార్యక్రమంలో ప్రజలు కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం గంగచోళ్లపెంట, మరుపల్లి, పాతబగ్గాం గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

సెంచూరియన్‌లో 'హెక్తాన్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరి యన్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం 'హెక్తాన్' పోటీలు ప్రారంభమయ్యాయి. ఏకాదాటిగా 72 గంటలపాటు కొనసాగే ఈ పోటీలలో విద్యార్థులు తమ సత్తాని చాటుకోవాలని ముఖ్య అతిధిగా పాల్గొన్న వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి పిలుపునిచ్చారు. 51 అంశాలకు సంబంధించిన సమస్యలకు పరిష్కారం చూపేందుకు విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారని అన్నారు. వీటిలో ఏయే సమస్యలకు పరిష్కారం కనుగొంటారో వాటికి పేటెంట్ పొందే అవకాశం ఉందన్నారు. మరికొన్ని అంశాలు జర్నల్స్ ప్రచురణకు ఉపయోగ పడతాయన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ ఇటువంటి అవకాశం విద్యార్థులకు అరుదుగా లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ అంశాలు బ్లాక్ చైన్ అండ్ సైబర్ సెక్యూరిటీ, స్మార్ట్ ఎడ్యుకేషన్, స్మార్ట్ ఆటోమేషన్, అగ్రిటెక్, రోబోటిక్స్ అండ్ డ్రోన్స్ తదితర అంశాలకు సంబంధించిన సమస్యలకు పరిష్కారం కనుగొంటారని వివరించారు. డీన్ డాక్టర్ సన్నీ డియోల్, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డీన్ ప్రొఫెసర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

రెండు గేట్లు ఎత్తివేత

వంగర: మండలంలోని గొర్లె శ్రీరాములు నాయుడు మడ్డువలస ప్రాజెక్టుకు చెందిన రెండు ప్రధాన గేట్లు ఎత్తి 2508 క్యూ షెక్కుల నీటిని అధికారులు నాగావళి నదిలోకి విడిచి పెట్టారు. కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా మరో 610 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్ట్ ఆయకట్టుకు విడిచి పెడుతున్నట్లు ప్రాజెక్టు ఎఇ నితిన్ కుమార్ శుక్రవారం తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి లెవెల్ నీటిమట్టం 65 మీటర్లకు గాను ఎగువన కురుస్తున్న వర్షాలు కారణంగా సువర్ణముఖి, వేగావతి నదుల ద్వారా 3118 క్యూ షెక్కుల నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరడంతో ప్రస్తుతం ప్రాజెక్టులో 64.55 మీటర్లు లెవెల్ నీటిమట్టం నమోదయినట్లు ఆయన తెలిపారు.

శ్మశానంలో చోరీపై ఫిర్యాదు

పూసపాటిరేగ : మండల కేంద్రంలోని శ్మశానంలో రూ.1.10 లక్షలు విలువైన దహన సంస్కరణలు స్టాండ్‌ను దొంగిలించారని శుక్రవారం సర్పంచ్ టొంపల సీతారాం, మహంతి జనార్ధనరావు అధ్వర్యంలో గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల ఒక మహిళ చనిపోవడంతో దహన సంస్కరణలకు శ్మశానానికి తీసుకువెల్లామని అక్కడ దహన సంస్కరణ స్టాండ్ కనిపించలేదని అన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో ఆకి శ్రీను, తాతాజీ, మందపాటి వాసు, పాల్గొన్నారు.